క్లుప్తంగా

కుట్టుమెషీన్ల అందజేత



రాయవరంలో మహిళలకు కుట్టుమెషీన్లు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

రాయవరం: గ్రామంలో క్రీస్తు సంఘం, లవ్అండ్‌కేర్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తొలి విడత కుట్టుమెషీన్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా కుట్టుమెషీన్లు అందజేశారు. ట్రస్ట్ ఫౌండర్ పాస్టర్ టి.నాతినియులు అధ్యక్షతన దోర్కా విడోస్ కుట్టుమెషీన్ల శిక్షణ కేంద్రం ద్వారా 12 మంది మహిళలకు శిక్షణ ఇచ్చారు. మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని నతానియేల్ పేర్కొన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కుట్టుమెషీన్ ట్రైనర్ ఎం.వరలక్ష్మి, ట్రస్ట్ సభ్యులు టి.కిషోర్‌కుమార్, టీవీ రత్నం, మందపల్లి కొండలరావు, మణెమ్మ, క్రీస్తు సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



కపిలేశ్వరపురంలో అవగాహన కల్పిస్తున్న దుర్గాదేవి

కపిలేశ్వరపురం: తల్లీ బిడ్డల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కృషి చేస్తున్నట్టు కపిలేశ్వరపురం సీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం పాల్గొన్న వక్తలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ దుర్గాదేవి మాట్లాడుతూ తల్లీ బిడ్డల ఆరోగ్యానికి పౌష్టికాహారం దోహదపడే తీరును వివరించారు. తల్లిపాలు అమృత ఫలితాన్నిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, ఎంపీహెచ్ఎస్ నాని, ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



సత్కారం పొందిన బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు

కె.గంగవరం: మండలంలోని పామర్రు ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్లి ఉపాధ్యాయులకు బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. తొలుత బదిలీపై వెళ్లిన హెచ్ఎం పితాని శ్రీనివాస్, పసగాడి హరి సూర్యనారాయణ, యండమూరి అంజిబాబు, నామ సురేఖ, పి.సురేష్‌కుమార్, ఆర్.మాలిని, కట్టా గోవిందరాజులను వీడ్కోలు పలుకుతూ శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. బదిలీపై పాఠశాలకు వచ్చిన హెచ్ఎం ఎర్ర ఈశ్వరుడు, నందూరి భీమరాజు, కందుల శ్రీనివాసు, ఆర్.రామచంద్రారెడ్డి, కృష్ణార్జున, ఆలీలకు స్వాగతం పలుకుతూ శాలువాలు, పూలదండలతో సత్కరించారు.

ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం



ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణులు

రామచంద్రపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలోని జిల్లా సహిత విద్యలో భాగంగా నియోజకవర్గాల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం రామచంద్రపురం మండల భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో రామచంద్రపురం మండలం నుంచి 30 మంది, కె.గంగవరం మండలం నుంచి 24 మంది, రాయవరం మండలం నుంచి 20 మంది మొత్తం 74 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు హాజరయ్యారు. ఎవరికి ఏ పరికరాలు అవసరమవుతాయో ప్రత్యేక నిపుణులు పరీక్షలు నిర్వహించి నిర్ధారించారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, డీవైఈఓ లక్ష్మీనారాయణ, ఎంఈఓలు తాడి వీరరాఘవరెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి, మూడు మండలాల సహిత విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్రదానం



మేడపాటి రామారెడ్డి(ఫైల్)

రాయవరం: మాచవరం గ్రామానికి చెందిన మేడపాటి రామారెడ్డి(78) మరణానంతరం ఆయన నేత్రాలను దానం చేశారు. గ్రామానికి చెందిన రామారెడ్డి బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన భార్య సీతారత్నం, కుమారులు సాయిబాబారెడ్డి, శ్రీనివాసరెడ్డిలు రామారెడ్డి నేత్రాలను ఐ బ్యాంక్‌కు ఇవ్వాలనుకుని, సమాచారం అందించారు. కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు చెందిన టెక్నికల్ సిబ్బంది వచ్చి కార్నియాను సేకరించి తీసుకుని వెళ్లారు. రామారెడ్డి కుమారుడు శ్రీనివాసరెడ్డి గతంలో కూడా స్వచ్ఛందంగా నేత్రదానంపై పలువురికి అవగాహన కల్పించి, నేత్రదానాన్ని ప్రోత్సహిస్తున్నారు.

జనం మనిషి జక్కంపూడి

కపిలేశ్వరపురం (మండపేట): జక్కంపూడి రామ్మోహనరావు సామాన్య జనం మనిషి అని, జీవించి ఉన్న ప్రతిక్షణం ప్రజల సమస్యల పరిష్కారం కోసం శ్రమించిన గొప్ప యోధుడని ఆయన జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నాయకులు జక్కంపూడి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కర్రి పాపారాయుడు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కార్మికులకు ఏ కష్టం వచ్చినా వెంటనే ప్రత్యక్షమయ్యి సమస్యను పరిష్కరించిన ఘనత జక్కంపూడిదన్నారు. ప్రజల్లో పనిచేయాలనుకునే ఏ ఒక్కరికైనా జక్కంపూడి ఆదర్శమన్నారు. పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు మాట్లాడుతూ దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో జక్కంపూడికి ఉన్న సాన్నిహిత్యాన్ని వివరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పార్టీ బలోపేతానికి జక్కంపూడి కృషిని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, పార్టీ పట్టణ, రూరల్ మండలాల అధ్యక్షులు పిల్లి శ్రీనివాస్, అడబాల బాబ్జీ, నాయకులు పలివెల సుధాకర్, మట్టపర్తి గోవిందరాజు, శెట్టి నాగేశ్వరరావు, పెంకే గంగాధర్, సిరిపురం శ్రీనివాస్, వీరమల్లు శ్రీనివాస్, పంపన శ్రీను, సాధనాల శివ భగవాన్, జొన్నపల్లి సత్తిబాబు, మెండు మురళీ, ముక్కా దాలియా, పెంకే వెంకట్రావు, వల్లూరు రామకష్ణ పాల్గొన్నారు.

కేశవరంలో...

కేశవరం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దూలం వెంకన్నబాబు కేక్ కట్ చేసి జక్కంపూడి సేవలను గుర్తు చేశారు.



రామచంద్రపురంలో జక్కంపూడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సూర్యప్రకాశ్, నాయకులు

ఆయన జీవించి ఉన్నంతకాలం ప్రజల రాజకీయాలే చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అన్నందేవుల కష్ణ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ముక్కపాటి శ్రీను, పార్టీ మండల కమిటీ ఉపాధ్యక్షుడు అద్దంకి రమణ నాయకులు సలాది శివ, పెదపాటి శివ, కూసు మునియ్య, పెదపాటి కనకం పాల్గొన్నారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: జననేత దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు జయంతిని పురస్కరించుకుని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. జక్కంపూడి చిత్రపటానికి పూలదండలు వేసి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, రామచంద్రపురం మండల అధ్యక్షుడు పోలినాటి వరప్రసాద్, నాయకులు సత్తి శంకరరెడ్డి, మల్లిడి సాయిలక్ష్మి, తొగరు మూర్తి, పెంటపాటి శ్రీనివాస్, పోతంశెట్టి గోపాలకృష్ణ, మట్టా బాబులు, బండి బుజ్జి, వెన్నేటి బాబు, కౌన్సిలర్ కేతా శ్రీను, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరంలో..

రాయవరం: సోమేశ్వరంలో బుధవారం మాజీ మంత్రి దివంగత జక్కంపూడి రామ్మోహనరావు జయంతిని అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక నేత గరగ సోమన్న ఆధ్వర్యంలో గరగ శ్రీనివాసరావు, గరగ వెంకటేశ్వరరావు, నాగదేవర తాతాజీ, శాకా చోడియ్య, శాకా అమ్మిరాజు తదితరులు జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంతో జక్కంపూడికి ఉన్న అనుబంధాన్ని అభిమానులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో యాళ్ల లోవకుమార్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



మండపేటలో మాట్లాడుతున్న కర్రి పాపారాయుడు



కేశవరంలో జక్కంపూడి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



సోమేశ్వరంలో దివంగత జక్కంపూడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

పీఏం ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

కాజులూరు: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి ప్రీమియం చెల్లించి ఈ పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. బుధవారం కాజులూరులో ఆయన రైతులతో మాట్లాడుతూ 2025 ఖరీఫ్ పంటకు బీమా పొందాలంటే రైతులందరూ తప్పనిసరిగా రూ.770 ప్రీమియం చెల్లించాలన్నారు. బ్యాంకులు, సహకార సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతులు సంబంధిత బ్యాంకుల్లోనే ప్రీమియం చెల్లించవచ్చని, రుణాలు లేనివారు రైతు సేవాకేంద్రాల్లో కాని, సీఎస్‌సీ మీసేవా కేంద్రాల్లో కాని ప్రీమియం చెల్లించవచ్చన్నారు. రైతులు పొలం పాస్‌పుస్తకం, లేదా వన్‌బీ ఫారం, వారి ఆధార్ కార్డు, ఓటీపీ కోసం ఆధార్ లింకు అయిన సెల్ ఫోను, బ్యాంక్ అకౌంట్ పాసుపుస్తకం తీసుకువచ్చి రూ.770 ప్రీమియం చెల్లించవచ్చన్నారు. దీని ద్వారా ప్రకృతి వైపరీత్యాలతో పంటల నష్టం జరిగినప్పుడు రైతుకు పరిహారం లభిస్తుందన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన అవసరం

కపిలేశ్వరపురం: మారుతున్న కాలానుగుణంగా సాంప్రదాయ పంటలతోపాటు ప్రత్యామ్నాయ పంటలపై సైతం రైతులు అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండలంలోని టేకి పీఏసీఎస్ ఆవరణలో బుధవారం ఉద్యాన శాఖ సర్వేసాయి ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్ పాం పంట సాగు తీరుతెన్నులపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ నూనెల వినియోగానికి విదేశీ దిగుమతులపై ఆధారపడి ఉందని, దేశంలో నూనె ఉత్పత్తుల వైపు రైతులు ఆలోచనలు సాగించాలన్నారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా వచ్చే లాభనష్టాలపై రైతులకు ఉద్యానవన శాఖాధికారులు కేజే ప్రభాకర్, వీరభద్రరావు, కోటేశ్వరరావు వివరించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కపిలేశ్వరపురం (మండపేట): మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, లేదంటే ఆరోగ్య సమస్యలకు గురికావాల్సి వస్తుందని విద్యార్థులను మండపేట రూరల్ ఎస్‌ఐ వి.కిశోర్ హెచ్చరించారు. వెలగతోడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు »మత్తు పదార్థాల వినియోగం-వాటి దుష్ప్రభావాలు- నివారణ చర్యలు« అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు, మహిళా భద్రతపై అవగాహన కల్పించారు. చదువుపై దృష్టి సారించి సమాజంలో ఉన్నత స్థితికి చేరుకునేందుకు వ్యసనాలు అడ్డుపడతాయన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను లోతుగా అధ్యయనం చేయడం ద్వారా సమయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చిన ఎస్‌ఐ కిశోర్ సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం కౌంటేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో మర్యాద పూర్వకమైన ప్రవర్తనతో మెలగాలని విద్యార్థులకు సూచించారు. మహిళా కానిస్టేబుల్ మంగాదేవి, ఉపాధ్యాయులు యేసురాజు, వీర వెంకట్రావు, సహదేవుడు, వీరభద్రరావు, సఫీర్ జనార్దనరావు, వీర్రాజు, సాయిబాబు పాల్గొన్నారు.



వెలగతోడు పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ కిశోర్

వైద్య సిబ్బందిని నియమించాలి

కె.గంగవరం: 24 గంటలు ఆసుపత్రిగా ఉన్న పామర్రు పీహెచ్‌సీలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలని ఎంపీపీ, అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు పంపన నాగమణి అన్నారు. మండలంలోని పామర్రు పీహెచ్‌సీ వద్ద బుధవారం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. తొలుత ఆసుపత్రి అభివృద్ధి వివరాలను కమిటీ సభ్యులకు వైద్యులు హర్షిత, విష్ణువర్ధన్ తెలిపారు. అనంతరం ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ ఇటీవల ఆసుపత్రిలో వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో నియమించకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసిందని వెంటనే సిబ్బందిని నియమించే ఏర్పాట్లు చేసే దిశగా ప్రభుత్వ అధికారులు పనిచేయాలని సూచించారు. ఆసుపత్రికి ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉండగా కేవలం ఒక్కరిని మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. దీంతో రాత్రి సమయంలో ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక కూటమి నాయకులు, మండల స్థాయి అధికారులు వెంటనే స్పందించి ఆసుపత్రికి తగినంత స్టాఫ్‌ను నియమించాలన్నారు. నూతనంగా నిర్మించిన నూతన ఆసుపత్రిని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే ఏర్పాట్లు చేస్తామన్నారు. కమిటీ సభ్యులు నానాపరపు కళ్యాణి, వాసంశెట్టి వెంకటదుర్గ, మరివాడ సూరిబాబు, ఆసుపత్రి సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

వెంకట్రావు సంస్కరణ సభను విజయంతం చేయాలి

కె.గంగవరం: మాల మహానాడు మండల వ్యవస్థాపక సభ్యుడు కోటి వెంకట్రావు సంతాప సభను విజయంతం చేయాలని మాల మహానాడు నాయకులు పెట్టా శ్రీనివాస్, రవ్వా భూషణం తదితరులు కోరారు. మండలంలోని కుందూరులో బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల వెంకట్రావు అనారోగ్యంతో మృతి చెందారని కె.గంగవరం పంచాయితీ ఆవరణలో నేడు(గురువారం) మధ్యాహ్నం 3 గంటలకు సంతాప సభ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న పెద్దలు, యూత్ సభ్యులు, మహిళల ఈ కార్యక్రమానికి హాజరై వెంకట్రావు ఘన నివాళి అర్పించాలన్నారు. అనంతరం మండల మాల మహానాడు నూతన కమిటీ ఎన్నిక ఉంటుందని తెలిపారు. ఈరెళ్ల రాజు, పాము భాస్కరరావు, బత్తుల అప్పారావు, తోకల వీర వెంకటరమణ, అయినా బత్తుల సుబ్రహ్మణ్యం, తోకల శ్రీనివాస్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



సంస్కరణ సభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

ఎరువుల వాడకం తగ్గించాలి

కె.గంగవరం: రసాయన ఎరువుల వాడకం తగ్గిస్తే రైతులకు మేలు జరుగుతుందని రామచంద్రపురం ఏడీఏ బి.నాగకుమార్ అన్నారు. మండలంలోని కోట, కోటిపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం క్రమేపీ తగ్గించి జీవన ఎరువులు, పచ్చి రొట్ట ఎరువుల వాడకం ద్వారా నేల ఆరోగ్యకరంగా ఉండి పంట అభివృద్ధి చెందుతున్నారు. ఏఓ సద్గురుమూర్తి మాట్లాడుతూ ఈ-పంట నమోదు రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలని తద్వారా ప్రభుత్వం నుంచి రాయితీలను పొందవచ్చన్నారు. వరి పంట వేసిన ప్రతి రైతు బీమా చెల్లించి పంట నష్టం వాటిల్లితే ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉంటాయని సూచించారు. సొసైటీ చైర్మన్ గాలి వెంకటేశ్వరరావు, వీఏఏ డి.నానిబాబు, వీహెచ్ఏ లావణ్య, రమేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కోటిపల్లిలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

పోలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

రాయవరం: స్థానిక తుల్యభాగ నదీ తీరాన ఉన్న పోలమ్మ తల్లి అమ్మవారి ఆవిర్భావ దినోత్సవం ఈ నెల 12న నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ బుధవారం విలేకరులకు తెలిపారు. భక్తుల ఇలవేల్పుగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తుల నీరాజనాలు అందుకుంటున్న అమ్మవారు ఉద్భవించిన రోజున ఆలయ వార్షికోత్సవంగా నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. పోలమ్మతల్లి, ముత్యాలమ్మ తల్లి ఆవిర్భావ వార్షికోత్సవాన్ని ఏటా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అమ్మవార్ల ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 12 మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచి ఏకాహం నిర్వహిస్తున్నామన్నారు. ఆధ్యాత్మిక భక్తి పాటలు భగవద్గీత శ్లోకాలు, విష్ణు సహస్ర పారాయణంతో పాటుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణం సమీపంలో భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

కూటమి మోసాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలి

కాజులూరు: కూటమి నాయకులు కల్లబొల్లి మాటలు చెబుతూ అబద్ధాలతో ప్రజలను ఎల్లకాలం మోసం చేయలేరని వారి కుట్రలను ప్రజాక్షేత్రంలోనే ఎండగట్టాలని జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు అన్నారు. గొల్లపాలెంలో మాజీ సర్పంచ్ పోతురాజు బాబురావు ఇంటివద్ద బుధవారం పార్టీ మండల అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు మాట్లాడుతూ ఎన్నికల్లో సూపర్‌సిక్స్ పేరుతో తప్పుడు వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన కూటమి వాటిని అమలు చేయలేక అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. కూటమి పాలకులు చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రతీ ఇంటికీ తీసుకువెళ్లేందుకే పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఈ నెల 11వ తేదీ సోమవారం మంజేరు, శీల గ్రామాల్లోనూ, 12వ తేదీ మంగళవారం చేదువాడ, తిప్పరాజుపాలెం గ్రామాల్లోనూ, 13వ తేదీ బుధవారం కోలంక, నామవానిపాలెం గ్రామాల్లోనూ, 14 వ తేదీ గురువారం కాజులూరులోనూ బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ తొలి విడత కార్యక్రమాన్ని నిర్వహంచేందుకు పార్టీ మండల అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు షెడ్యూల్ ఖరారు చేశారు. మండల గ్రామాలకు చెందిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గొల్లపాలెంలో షెడ్యూల్ ఖరారు చేస్తున్న పార్టీ మండల అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు

పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిదీ

కపిలేశ్వరపురం (మండపేట): పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదీ అని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరావు అన్నారు. మండపేట ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఇఫ్కో సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వేప మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పర్యావరణ సమతుల్యతకు విశేష కృషి చేస్తున్న ఇఫ్కో సంస్థను అభినందించారు. సంస్థ రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్ బీఎల్ రాజు మాట్లాడుతూ నానో ఎరువులు ఉపయోగించడం ద్వారా నేల, వాయు కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఇఫ్కో జిల్లా అధికారి జి.శ్యామ్ ప్రసాద్ బాబు, మాట్లాడుతూ జిల్లాలో 4వేల మొక్కలు పంపకానికి సిద్ధం చేశామన్నారు. ప్రారంభ సూచికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొక్కను నాటారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వ్యవసాయాధికారులు కేవీ చౌదరి, కె ప్రభాకర్, ఎంపీడీఓ సత్యనారాయణ, తాపేశ్వరం పీఏసీఎస్ త్రీమెన్ కమిటీ చైర్మన్ పి.రామకృష్ణారెడ్డి, మండపల్లి చంద్రశేఖర్ దొరబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుల నియామకం



మాకం శివ కుమార్, రామచంద్రపురం రూరల్



సానబోయిన రాంబాబు, రామచంద్రపురం అర్బన్



చొల్లంగి వెంకట రమణ, కాజులూరు మండలం



పిల్లి లోవకల్యాణ్, కె.గంగవరం మండలం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నియోజకవర్గంలోని మూడు మండలాలు, రామచంద్రపురం అర్బన్‌లకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రామచంద్రపురం రూరల్ మండలానికి ద్రాక్షారామకు చెందిన మాకం శివకుమార్, రామచంద్రపురం అర్బన్‌కు సానబోయిన రాంబాబు, కాజులూరు మండలానికి చొల్లంగి వెంకటరమణ, కె.గంగవరం మండలానికి మసకపల్లి గ్రామానికి చెందిన పిల్లి లోవ కల్యాణ్‌లను నియమించారు. తమ మండలాల్లో పార్టీ బలోపేతానికి, బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు. తమ నియామకంపై పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు.

బిడ్డకు తొలిగుర్తింపు జనన ధ్రువపత్రం

- 21 రోజుల్లోపు నమోదు తప్పనిసరి
- నమోదు చేయకపోతే చట్టపరంగా శిక్షార్హులు

రామచంద్రపురం రూరల్: పుట్టిన బిడ్డకి చట్టపరంగా గుర్తింపునిచ్చే ప్రక్రియ జనన నమోదు. జనన నమోదు తమ బిడ్డకు ప్రతి తల్లిదండ్రులు చేయవలసిన మొదటి బాధ్యతాయుతమైన వ్యవహారం. జనన, మరణ నమోదు చట్టం 1969 ప్రకారం బిడ్డ పుట్టిన 21 రోజుల్లోపు ఆ జననాన్ని తప్పనిసరిగా నమోదు చేయించాలి. ఈ విధంగా జనన, మరణాలను నమోదు చేయడం వల్ల, ఆ సమాచారం ప్రభుత్వానికి జనగణన సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ విధంగా బిడ్డ జననం నమోదు చేయడం వల్ల, జనన ధ్రువీకరణ పత్రం పొందేందుకు అర్హులవుతాం. జనన ధ్రువీకరణ పత్రం వల్ల బిడ్డకి చట్టబద్ధమైన గుర్తింపు ఇచ్చినవాళ్లమవుతాం. ఒక వేళ జననాన్ని నమోదు చేయకపోతే 1969 జనన, మరణాల నమోదు చట్టం ప్రకారం శిక్షార్హులమవుతాం.

జనన నమోదు బాధ్యత ఎవరికి?

జననం గురించి తెలియపరచవలసిన బాధ్యత బిడ్డ పుట్టిన ప్రదేశాన్ని బట్టి సంబంధిత వ్యక్తులపై ఆధారపడి ఉంటుంది. కానీ సదరు ప్రక్రియ సజావుగా జరిగిందా? లేదా? అనేది సరిచూసుకోవలసిన బాధ్యత తల్లిదండ్రులదే.

గ్రామ ప్రాంతం: గ్రామ సచివాలయ కార్యాలయం భారత పౌరులకు ఇతర దేశాలలో సంతానం కలిగితే ఆ కుటుంబం తిరిగి వచ్చిన తరువాత వారు స్థిరపడిన ప్రదేశంలో అరవై రోజుల్లోపు నమోదు చేయాల్సి ఉంటుంది. సాధారణంగా జననం జరిగిన 21 రోజుల్లోపు తెలియపరిచిన వారికి ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేకుండా జనన ధ్రువీకరణ పత్రం ఉచితంగా అందజేస్తారు. అయితే పంచాయతీల పరిధిలో ఉచితంగానే అందిస్తున్నప్పటికీ మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మాత్రం రూ.80 ఫీజు వసూలు చేస్తారు. ఈ సేవకు మీసేవా కేంద్రాల ద్వారా రూ.90 ఫీజుగా చెల్లించవలసి వస్తుంది. జన్మించిన 21 రోజుల తర్వాత కూడా నమోదు చేయొచ్చు. కానీ అపరాధ రుసుం చెల్లించవలసి ఉంటుంది. నమోదు జరిగిన ఒక ఏడాదిలోపు ఎలాంటి ఫీజు లేకుండా, బిడ్డకు పెట్టిన పేరును రిజిస్ట్రార్‌కి తెలియపరిచి, రిజిస్టర్ చేర్చవచ్చు. నమోదు తేదీ నుంచి 15 సంవత్సరాల వరకు ఆలస్య రుసుముతో బిడ్డ పేరును రిజిస్టర్‌లో చేర్చుకోవచ్చు.

జనన ధ్రువీకరణ పత్రం ప్రయోజనాలు

- జననం నమోదు కాబడిన బిడ్డలకు ప్రభుత్వ పరంగా పౌష్టికాహారం, వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా అందుతాయి.
- పాఠశాలలో చేరడానికి గుర్తింపు పత్రంగా ఉపయోగపడుతుంది.
- పెరిగి పెద్దయిన తర్వాత ఆధార్ వంటి గుర్తింపు పత్రాలకు ఆధారంగా జనన ధ్రువపత్రం అవసరం
- డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి
- పాస్‌పోర్టు పొందడానికి
- ప్రభుత్వ, ప్రభుత్వ రంగ, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాల్లో చేరడానికి
- గరిష్ఠ, కనీస వయో పరిమితులకు సంబంధించిన ఎన్నో ఇతర ప్రయోజనాలు పొందడానికి
- వివాహం రిజిస్టర్ చేయించుకోవడానికి
- సైన్యంలో చేరడానికి
- వారసత్వంగా వచ్చే ఆస్తి పొందే హక్కును కలిగి ఉండడానికి
- నివాసం ఏర్పరచుకోవడానికి
- జనన ధ్రువపత్రం తప్పనిసరిగా కావాలి



జనన ధ్రువపత్రంపై ఉండే లోగో



పుట్టిన బిడ్డతో తల్లి

జనన ప్రదేశం	బాధ్యత గల వ్యక్తి
ఆసుపత్రులు నర్సింగ్‌హోంలు,	ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	
ఆరోగ్య కేంద్రాలు	
ఇల్లు	ఇంటి యజమాని
జైళ్లు	ఇన్‌చార్జ్ ఆఫీసర్
సత్రాలు	ఇన్‌చార్జ్ ఆఫీసర్

నమోదు ఎక్కడ చేయాలి?

పట్టణ ప్రాంతం	మున్సిపల్ కార్పొరేషన్,
మున్సిపాలిటీ	వార్డు సచివాలయాలు, కంటోన్మెంట్ బోర్డు, టౌన్‌షిప్ పాలనా వ్యవస్థ